# ఒక యుద్ధం ముగిసింది, మరి రెండవ దాని మాటేమిటి!

24 ఫిబ్రవరి 2022న ప్రారంభమైన ఉక్రెయిన్‌పై రష్యా దాడులు పూర్తి యుద్ధంగా మారు గత వెయ్యి రోజులు దాటుతూ 1058వ రోజు దాటుతున్న వేళ, ఈ యుద్ధ మారణహోమానికి ముగింపే కనిపించడం లేదు. గత 15 మాసాలుగా జరిగిన ఇజ్రాయిల్-పాలస్తీనా యుద్ధం కాల్పుల విరమణ, యుద్ధ ముగింపుకు అంగీకారం కుదరడం హర్షదాయకం. ఉక్రెయిన్ - రష్యా యుద్ధంలో ఇరు పక్షాలకు చెందిన లక్షల మంది సైనికులు, సాధారణ పౌరులు ప్రాణాలు కోల్పోగా, మిలియన్ల కొద్దీ గాయపడడం, పది మిలియన్లకు పైగా ఉక్రెనియన్లు నిర్వాసితులుగా మారడంతో శరణార్థి శిబిరాల్లో అమానవీయ దుస్థితుల్లో బలవంతంగా ఊపిరి పీల్చుకుంటున్నారు. వివిధ అంచనాల ప్రకారం ఇప్పటి వరకు లక్ష వరకు ఉక్రెనియన్ బలగాలు చనిపోగా, 4 లక్షలకు పైగా గాయపడ్డారు. అదే విధంగా కనీసం 1.5 లక్షల రష్యా బలగాలు ప్రాణాలను కోల్పోయారని తెలుస్తున్నది. రష్యా ఆక్రమించిన భూభాగాన్ని వెనక్కి తీసుకోవడానికి ఉక్రెయిన్, ఉక్రెయిన్‌ను ఆక్రమించాలని రష్యా తమ తమ పోరాటాలను ఉధృతంగా చేస్తున్నాయి.

## ఉక్రెయిన్ గత చరిత్ర - యుద్ధం ప్రారంభం:

1700ల్లో రష్యా సామ్రాజ్య పాలనలో ఉన్న ఉక్రెయిన్ 1917లో రష్యా ఉద్యమంతోరష్యా సామ్రాజ్య పాలన నుంచి విముక్తమై 1922లో సోవియట్ యూనియన్‌లో భాగమై పోయింది. 1930ల్లో మిలియన్ల ఉక్రెనియన్లు కరువుకాటకాలతో ప్రాణాలను కూడా కోల్పోవడం జరిగింది. 1991లో సోవియట్ యూనియన్ విచ్ఛిన్నం కావడంతో ఉక్రెయిన్ స్వతంత్ర దేశంగా నిలబడింది. రష్యాలోని మెజారిటీ ప్రజలే కాకుండా పుతిన్ లాంటి నాయకులు కూడా ఉక్రెయిన్ తమ దేశంలో భాగమే అని భావించడంతో రెండు దేశాల మధ్య విభేదాలు రోజు రోజుకు పెరగడం, చివరకు 24 ఫిబ్రవరి 2022న రష్యా పూర్తి స్థాయి దాడి చేయడంతో యుద్ధం అనివార్యం అయ్యింది. 2019లో ఉక్రెయిన్ అధ్యక్షుడిగా ఎన్నిక కావడంతో పాటు అమెరికా, యూరోప్ దేశాల సహకారంతో యుద్ధం మారణహోమంగా మారింది. రష్యా పక్షాన చైనా, ఇరాన్, ఉత్తర కొరియాలు నిలవడంతో నువ్వా నేనా అనే రీతిలో మారణహోమం కొనసాగుతున్నది.

## సమీపంలో కానరాని యుద్ధ విరమణ ఆలోచనలు:

నేడు ఉక్రెయిన్-రష్యా యుద్ధం కాల్పుల విరమణ లేదా ముగింపుకు రావాలంటే ఇరు పక్షాలను ఒక టేబుల్‌పై చర్చలకు కూర్చోబెట్టాల్సి ఉంది. ఇది చాలా కష్టసాధ్యమని ప్రస్తుత పరిస్థితులు స్పష్టం చేస్తున్నాయి. ఈ యుద్ధానికి చరమగీతం పాడడానికి నాలుగు మార్గాలు కనిపిస్తున్నట్లు విశ్లేషిస్తున్నారు. వీటిలో యుద్ధం దీర్ఘకాలం కొనసాగడం, యుద్ధ తీవ్రత తగ్గడం, యూఎస్ యూరోప్‌ల సహకారంతో ఉక్రెయిన్ గెలవడం, లేదా రష్యా గెలుపు బాటన నిలవడం లాంటి పరిష్కార మార్గాలు కనిపిస్తున్నాయి. డొనాల్డ్ ట్రంప్ కూడా యుద్ధ ముగింపును కోరుతున్నప్పటికీ రష్యా ఆధిపత్యాన్ని అంగీకరించడం అసాధ్యమే. యూఎస్, యూరోప్‌ల మిలటరీ, ఆర్థిక సహకారంతో మాత్రమే ఉక్రెయిన్ పై చేయి సాధించగలదు.కాల్పుల విరమణ లేదా యుద్ధ విరమణ చర్చలకు ఉక్రెయిన్ అంగీకరిస్తున్నప్పటికీ ఈ ప్రతిపాదనలను రష్యా వ్యతిరేకిస్తున్నది.

ఎవరు పట్టు వారిది. యుద్ధ భూమిలో పోతున్న ప్రాణాలు ఇరువురివి. ఇరు దేశాలు పౌర సంక్షోభాలను ఎదుర్కొంటున్నాయి. దౌత్య పరమైన ప్రతిపాదనలు ఆదిలోనే తుంచబడుతున్నాయి. జెలెన్‌స్కీ, పుతిన్‌లు మంకు పట్టు పట్టుకొని మారణహోమం చూస్తున్నారు. మరణాల లెక్కలను సవరించుకుంటున్నారు. ఆకలి కేకలను మించి యుద్ధ మోతలు మోగిస్తున్నారు. రష్యా గెలుపు పశ్చిమ దేశాలకు ఓటమితో సమానం. ఉక్రెయిన్ గెలుపు రష్యా-చైనాలకు తల వంపులు అవుతున్నది. యుద్ధం దీర్ఘకాలం కొనసాగితే మారణహోమ మరుభూమి తప్ప అభివృద్ధి ఆనందాలు కనిపించవు. యుద్ధం కొనసాగితే ఇరు దేశాల ప్రజలే కాకుండా ప్రపంచవ్యాప్త 840 కోట్ల ప్రజలు దాని దుష్ప్రభావ వేడికి ప్రభావితం అయ్యారు, అవుతూనే ఉంటారు. గాజా మారణోమ అంతానికి మార్గం దొరికినట్లు, రష్యా దండయాత్రకు కూడా ఓ పరిష్కారం సత్వరమే దొరకాలని కోరుకుందాం.



-డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# రూ.11,440 కోట్లతో రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ పునరుద్ధరణ ప్రణాళికకు కేబినెట్ కమిటీ ఆమోదం

న్యూఢిల్లీ, జనవరి 18:గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ (సీసీఈఏ) రూ. 11,440 కోట్లతో ఆర్ఐఎన్ఎల్ పునరుద్ధరణ ప్రణాళికను ఆమోదించింది. ఇందులో రూ. 10,300 కోట్లు రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్)లోకి ఈక్విటీ మూలధనంగా, రూ. 1,140 కోట్ల నిర్వహణ మూలధనం 7 శాతం సంచితం కాని ప్రాధాన్య వాటా మూలధనంగా ఉంటుంది. పదేళ్ల తర్వాత వీటిని విడిపించుకుని ఆర్ఐఎన్ఎల్ ను గతిశీల సంస్థగా నిలపవచ్చు.

ఆర్ఐఎన్ఎల్ ఉక్కు మంత్రిత్వ శాఖ పరిపాలన నియంత్రణలో ఉన్న షెడ్యూలు-ఎ సీపీఎస్ఈ. 100% భారత ప్రభుత్వ యాజమాన్యంలో ఉంది. విశాఖపట్నం ఉక్కు కర్మాగారాన్ని (వీఎస్పీ) ఆర్ఐఎన్ఎల్ నిర్వహిస్తోంది. ఆంధ్రప్రదేశ్ లో ప్రభుత్వ రంగంలో ఉన్న ఏకైక తీర ప్రాంత ఉక్కు కర్మాగారం వీఎస్పీ. ఏడాదికి 7.3 మిలియన్ టన్నుల ద్రవ రూప ఉక్కు దీని స్థాపిత సామర్థ్యం.

ఆర్ఐఎన్ఎల్ ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉంది (గతేడాది మార్చి 31 నాటికి ఆర్ఐఎన్ఎల్ నికర విలువ రూ. (−) 4538.00 కోట్లు, ప్రస్తుత ఆస్తులు రూ. 7,686.24 కోట్లు, ప్రస్తుత అప్పులు రూ. 26,114.92 కోట్లు). ఆర్ఐఎన్ఎల్ కు సంబంధించి నిర్వహణ మూలధనం కోసం బ్యాంకులు మంజూరు చేసే రుణ పరిమితులు ముగిశాయి.

బ్యాంకుల నుంచి తదుపరి రుణాలు పొందే పరిస్థితి లేదు. గతేడాది జూన్ లో కాపెక్స్ రుణ చెల్లింపులు, వడ్డీ చెల్లింపులను కూడా ఆర్ఐఎన్ఎల్ చేయలేకపోయింది.

ఆర్ఐఎన్ఎల్ కు రూ. 10,300 కోట్ల ఈక్విటీని అందించడం నిర్వహణ మూలధనాన్ని పెంచడంలో సమస్యలను అధిగమించడానికి సహాయపడుతుంది.

మరింత ఉత్పాదక పద్ధతుల్లో కార్యకలాపాలను ప్రారంభించడానికి ఇది దోహదం చేస్తుంది. దాంతో కంపెనీ క్రమంగా కీలకమైన తన పూర్తి ఉత్పత్తి సామర్థ్యాన్ని చేరుకోగలదు. ఉక్కు ఉత్పత్తిని పెంపొందించడం ద్వారా భారత ఉక్కు మార్కెట్‌లో స్థిరత్వాన్ని నెలకొల్పడం జాతీయ ప్రయోజనం. అంతేకాకుండా ఉద్యోగుల, ఉక్కు కర్మాగార కార్యకలాపాలపై ఆధారపడి ఉన్న వారి జీవనోపాధులనూ ఇది రక్షిస్తుంది. ఈ నెలలో రెండు, ఈ ఏడాది ఆగస్టులో మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌తో పూర్తి స్థాయి ఉత్పత్తిని ప్రారంభిస్తుందని పునరుద్ధరణ ప్రణాళిక అంచనా.

ఉక్కు ఉత్పత్తి ఆర్థిక వ్యవస్థలో ప్రధాన రంగం. ఏ దేశానికైనా ఆర్థికాభివృద్ధి సూచికలలో అది ఒకటి. విశాఖపట్నం ఉక్కు కర్మాగారం పునరుద్ధరణ, పూర్తి సామర్థ్యంతో కార్యకలాపాల కొనసాగింపు ప్రజా వనరులను సమర్థవంతంగా వినియోగించడంలో భరోసా ఇస్తుంది. అంతేకాకుండా 2017 జాతీయ ఉక్కు విధానం లక్ష్యాలను సాధించడంలో దోహదపడుతుంది.ఆత్మనిర్భర భారత్ కోసం దేశీయ పరిశ్రమలకు చేయూత ఇవ్వడంలో ప్రభుత్వ స్థిరమైన నిబద్ధతకు ఈ వ్యూహాత్మక నిర్ణయం నిదర్శనం.

# బనకచర్లకు నీళ్లు తేవడమే నా ధ్యేయం- చంద్రబాబు

**-నదులు అనుసంధానం చేయడం నా కల**
**-రాయలసీమలో గోదావరి నీళ్లు పారిస్తా**
**-రతనాల సీమగా మారుస్తా**
**-మైదుకూరు ఎన్టీఆర్ వర్ధంతి సభలో చంద్రబాబు ఉద్ఘాటన**

అమరావతి, జనవరి 18: గోదావరి-పెన్నా, పోలవరం - బనకచర్ల వరకు అనుసంధానం చేస్తే గేమ్ ఛేంజర్ గా తయారవుతుందని చంద్రబాబు అన్నారు. బనకచర్లకు పంథాను తాను కొనసాగిస్తున్నట్లు చంద్రబాబు తెలిపారు.

రెండేళ్లలో పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి, రాష్ట్రంలో సాగు, త్రాగునీరుకు ఇబ్బందులు లేకుండా




గోదావరి నీళ్లు తీసుకురావడం నా జీవితాశయమని స్పష్టం చేశారు. తనను ఇంత వాడిని చేసిన సీమ ప్రజలకు నీళ్లు అందించి వారి తీర్చుకోవాలనేదే నా ఆలోచన అని పేర్కొన్నారు. మైదుకూరులో నేడు నిర్వహించిన ఎన్టీఆర్ వర్ధంతి సభలో పాల్గొన్న ఆయన ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ, తాను కూడా రాయలసీమ ప్రాంతానికి చెందిన వాడినేనని, తనకు రాయలసీమ సమస్యలపై పూర్తి అవగాహన ఉందంటూ చెప్పుకొచ్చారు చంద్రబాబు. రాయలసీమను రతనాలసీమగా మార్చే బాధ్యత నాడు దివంగత ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు తీసుకున్నారని, ఆ తర్వాత అదే చేస్తానంటూ సీఎం హామీ ఇచ్చారు. గాలేరు, నగరి, హంద్రీనీవాకు పునాదులు వేసింది ఎన్టీఆర్ అన్న విషయాన్ని రాష్ట్ర ప్రజలు ఎప్పటికి గుర్తుంచుకోవాలని చంద్రబాబు తెలిపారు. కాంగ్రెస్ సహా మిగిలిన ఏ పార్టీలు కడపకు చేసిందేమీ లేదని, టీడీపీ హయాంలోని కడప జిల్లా అభివృద్ధి పథంలో నడిచిందంటూ చంద్రబాబు అన్నారు.

### తట్ట మట్టి కూడా ఎత్తని జగన్

మాటలు చెప్పి ఎక్కడ ఒక తట్ట మట్టి కూడా పోయకుండా ఐదేళ్లు వైసీపీ పరిపాలన సాగిందని, అందుకే ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. రాబోయే ఎన్నికల్లో కడప జిల్లా క్లీన్ స్వీప్ కావాలంటూ కార్యకర్తలకు చంద్రబాబు పిలుపునిచ్చారు. కార్యకర్తలు మరింత స్పీడ్ పెంచాలని, మొన్న ఎన్నికల్లో వచ్చిన ఫలితాలు చరిత్రను తిరగ రాశాయని చంద్రబాబు అన్నారు. నదుల అనుసంధానం కు ప్రభుత్వం కట్టుబడి ఉందని, అప్పుడే కరువు రహిత రాష్ట్రంగా ఏపీ గుర్తింపు పొందుతుందన్నారు.

### పేదవాడి గుండెల్లో తీపి జ్ఞాపకం ఎన్టీఆర్

తెలుగు జాతి చరిత్ర ఉన్నంత వరకూ తెలుగువారి గుండెల్లో ఉండే ఏకైక వ్యక్తి ఎన్టీఆర్ అని ముఖ్యమంత్రి చంద్రబాబు కొనియాడారు. అనుక్షణం తెలుగువారి ఆత్మగౌరవం కోసం తపించిన నాయకుడు అని పేర్కొన్నారు. వైఎస్ఆర్ జిల్లా ఎన్టీఆర్ అంటే మూడు అక్షరాలు కాదని అన్నారు. తెలుగువారి ఆత్మగౌరవం. పేదవాడి గుండెల్లో తీపి జ్ఞాపకం ఎన్టీఆర్ అని పేర్కొన్నారు.. ప్రభుత్వం అంటే పాలకులు కాదని, సేవకులని చెప్పిన ఏకైక నాయకుడు అన్న ఎన్టీఆర్ అని ప్రశంసలు కురిపించారు.. పేదవాళ్లకు పక్కా ఇళ్లు నిర్మించింది ఎన్టీఆర్ అని అన్నారు. బడుగు బలహీన వర్గాల గుండెల్లో చెరగని ధైర్యం అన్న ఎన్టీఆర్ అని పేర్కొన్నారు.. సంక్షేమానికి అర్థం తెచ్చారు. అభివృద్ధి అంటే చేసి చూపించారు. సంస్కరణలకు నాంది పలికిన యుగపురుషుడు ఆయన అంటూ అన్నారు.

### ఈ నెలాఖరులోనే వాట్సప్ గవర్నెన్స్: సీఎం చంద్రబాబు

ఈ నెలాఖరులోనే వాట్సప్ గవర్నెన్స్ తీసుకొస్తున్నా. ఏ పని కావాలన్నా ఒక మెసేజ్ పెడితే చాలు. మీ సమస్యల పరిష్కారానికి ఆఫీసులకు వెళ్లే పనిలేదు. మీ ముందుకే వచ్చి సమస్యలు పరిష్కరించే ఏర్పాట్లు చేస్తున్నాం.'' అని ఈ సభలో చంద్రబాబు ప్రకటించారు..

ఇది ఇలా ఉంటే ఎన్నికల అనంతరం సీఎం హోదాలో చంద్రబాబు తొలిసారిగా మైదుకూరుకు రావడంతో కూటమి నాయకులు, కార్యకర్తలు భారీగా మైదుకూరుకు భారీగా తరలివచ్చారు.. ఆయనకు అక్కడి నేతలు ఘనంగా స్వాగతం పలికారు. అలాగే మైదుకూరు నియోజకవర్గానికి సంబంధించి పలు హామీలను సైతం చంద్రబాబు సభ సాక్షిగా ప్రకటించారు.

# లారీని ఢీకొన్న బస్సు- తండ్రి, కుమార్తె మృతి..

అమరావతి, జనవరి 18:విజయనగరం జిల్లా గజపతినగరం మండలం మదుపాడ సమీపంలో ఆగి ఉన్న లోడ్ లారీని డెంటల్ సైన్స్ ఇన్‌స్టిట్యూట్ బస్సు నేటి తెల్లవారు ఝామున ఢీకొట్టింది. ఈ ప్రమాదం లో తండ్రి , కుమార్తె స్పాట్ లో మరణించారు. మరో అయిదుగురు తీవ్రంగా గాయపడ్డారు.. ప్రమాద సమయంలో బస్సులో 42 మంది ప్రయాణీకులు ఉన్నారు. వారంతా ఫ్రీ మెడికల్ క్యాంప్ కోసం వెళ్తున్నట్లు సమాచారం.

ఒడిశాలోని మల్కాజిగిరి నుంచి విశాఖ తరగవలస వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది.. ప్రమాదం గురించి సమాచారం తెలిసిన వెంటనే సంఘటనా స్థలానికి 5 అంబులెన్స్ చేరుకున్నాయి. బస్సులో చిక్కుకున్నవారిని బయటకు తీశారు. క్షతగాత్రులను మెరుగైన వైద్యం కోసం ఆసుపత్రికి తరలించారు.. బస్సులో ఉన్నవాళ్లు అంతా ఒరిస్సా రాష్ట్రంలో మల్కాజిగిరి వాసులుగా పోలీసులు గుర్తించారు.

# చెరువులో దూకి వృద్ధ దంపతులు ఆత్మహత్య ..

ఖమ్మం, జనవరి 18: ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలంలో విషాదం నెలకొంది. బుగ్గపాడు గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు చెరువులో శవమై కనిపించారు. మృతులు పంతంగి కృష్ణారావు (60), సీత(55) గా స్థానికులు గుర్తించారు. ఈ రోజు తెల్లవారు జామున పొలానికి వెళ్తున్న రైతులు గ్రామానికి శివారులోని రావి చెరువులో రెండు మృతదేహాలను గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను స్థానికులు సహాయంతో బయటకు తీశారు. అనంతరం ఇద్దరి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

### చెరువులోకి దూకి ఆత్మహత్య:

అయితే కృష్ణ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. పిల్లలందరికీ వివాహాలు చేశారు. ఇటీవల ఆటో కూడా మరమ్మతులకు గురవటంతో కుటుంబ పోషణ కష్టంగా మారింది. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులు తాళలేక భార్య, భర్త గ్రామ శివారులోని చెరువులోకి దూకి ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని మృతుల కుటుంబ సభ్యులు, స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

అయితే మృతి చెందిన దంపతులు శనివారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో రోడ్డుపై నడిచి వెళుతున్న దృశ్యం ఓ షాపు ఎదురుగా ఉన్న సీసీ టివిలో నమోదు అయింది. సీసీ టీవీ వీడియోల ఆధారంగా ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పరిసరాల శుభ్రతే ప్రగతికి తొలి మెట్టు - పవన్ కల్యాణ్



అమరావతి, జనవరి 18: పరిసరాలను పరిశుభ్రం చేసుకోవడం అందరి బాధ్యత అని అన్నారు ఏపి డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ .. కరోనా మహమ్మారి వంటి పరిస్థితుల్లో శుభ్రత గురించి ఆలోచన చేయాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. స్వర్గీయ నందమూరి తారక రామారావు వర్ధంతి పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇక ప్రతినెల మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో గుంటూరు జిల్లా పెదకాకాని మండలం నంబూరు గ్రామంలో 'స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్' కార్యక్రమాన్ని నిర్వహించారు, ఈ కార్యక్రమానికి పవన్ కల్యాణ్ హాజరయ్యారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో ఆయన కల్యాణ్ మొక్కలు నాటారు, అనంతరం పారిశుధ్య తరలింపు వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు.

ఆయనతో పాటు రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర పాల్గొన్నారు. పంచాయతీల పరిధిలో చేస్తున్న స్వచ్ఛత కార్యక్రమాలు, డంపింగ్ యార్డులు, చెత్తను వేరు చేసే క్రమం వంటి విషయాలను స్వయంగా పంచాయతీ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు పవన్. ప్రస్తుతం చెత్తను సేకరిస్తున్న విధానాన్ని పరిశీలించారు. పారిశుద్ధ్య సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చెత్త ట్రాక్టరును స్వయంగా పవన్ కళ్యాణ్ గారు నడిపి, స్వచ్ఛతలో తాను కూడా భాగమనే సందేశాన్ని నింపారు.

ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ, పరిసరాలు శుభ్రతే ప్రగతికి తొలిమెట్టు అన్నారు.. కొన్ని దేశాలు వ్యర్థాలతో అద్భుతాలు చేస్తున్నాయని గుర్తు చేశారు, ఏపీలో కూడా 'స్వచ్ఛ దివాస్' కార్యక్రమంతో మంచి ఫలితాలు సాధించాలని అన్నారు. 2048 నాటికి రాష్ట్రం అద్భుతమైన పురోగతి కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపు ఇచ్చారు? పారిశుద్ధ్య కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మంటూ పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు పెంచాల్సిన అవసరం ఉందని పవన్ పేర్కొన్నారు.

ఏ కార్యక్రమం అయినా రాత్రికి రాత్రి అద్భుతాలు జరగవని అంటూ . రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనకు ప్రజల సహకారం కూడా కావాలని అన్నారు. మన చిన్నతనం నుండి వ్యర్థాలను ఇంటి పెరటిలో, మొక్కలకు వేసే సంస్కృతి ఉందని, అయితే ఇప్పుడు అది పూర్తిగా దూరమైందని చెప్పారు. మరలా ఆ సంస్కృతిని తీసుకురావాలని ప్రజలకు ఆయన పిలుపు ఇచ్చారు పవన్ కల్యాణ్.

ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీ శశిభూషణ్ కుమార్, పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ, గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

# వికసిత్ భారత్‌ను నిర్మించడంలో మహిళా శక్తి భారీ పాత్ర

న్యూఢిల్లీ, జనవరి 18:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈరోజు 10 రాష్ట్రాలు మరియు 2 కేంద్రపాలిత ప్రాంతాలలో 230 కంటే ఎక్కువ జిల్లాల్లోని 50000 గ్రామాల్లోని ఆస్తి యజమానులకు పథకం కింద 65 లక్షల ఆస్తి కార్డులను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ భారతదేశంలోని గ్రామాలకు, గ్రామీణ ప్రాంతాలకు ఈరోజు చారిత్రాత్మకమైన రోజు అని, ఈ సందర్భంగా లబ్ధిదారులకు, పౌరులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఐదేళ్ల క్రితం గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజలు తమ ప్రాపర్టీ కార్డులను పొందేలా 'స్వామిత్వ' పథకాన్ని ప్రారంభించామని ప్రధాని వ్యాఖ్యానించారు. వివిధ రాష్ట్రాలు ఆస్తి యాజమాన్య ధృవీకరణ పత్రాలను ఘరోని, అధికార్ అభిలేఖ్, ప్రాపర్టీ కార్డ్, మల్మట్టా పత్రక్ మరియు అవాసీయ భూమి పట్టా వంటి వివిధ పేర్లతో సూచిస్తాయని ఆయన వ్యాఖ్యానించారు. "గత 5 సంవత్సరాలలో 1.5 కోట్ల మందికి పైగా కార్డులు జారీ చేయబడ్డాయి" అని శ్రీ మోదీ అన్నారు. నేటి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 65 లక్షల కుటుంబాలకు ఈ కార్డులు అందాయన్నారు. స్వామిత్వ యోజన కింద గ్రామాల్లో దాదాపు 2.25 కోట్ల మంది ప్రజలు తమ ఇళ్లకు చట్టబద్ధమైన పత్రాలను పొందారని ప్రధాన మంత్రి వ్యాఖ్యానించారు. లబ్ధిదారులందరికీ ఆయన హృదయపూర్వక అభినందనలు మరియు శుభాకాంక్షలు తెలిపారు.

వాతావరణ మార్పు, నీటి కొరత, ఆరోగ్య సంక్షోభాలు మరియు మహమ్మారి వంటి అనేక సవాళ్లను 21వ శతాబ్దం అందజేస్తోందని వ్యాఖ్యానించిన ప్రధాన మంత్రి, ప్రపంచం ఎదుర్కొంటున్న మరో ముఖ్యమైన సవాలు ఆస్తి హక్కులు మరియు చట్టపరమైన ఆస్తి పత్రాల కొరత అని హైలైట్ చేశారు. ఐక్యరాజ్యసమితి అధ్యయనాన్ని ఉదహరిస్తూ, వివిధ దేశాల్లో చాలా మందికి వారి ఆస్తులకు సంబంధించి సరైన చట్టపరమైన పత్రాలు లేవని వెల్లడైంది. పేదరికాన్ని తగ్గించాలంటే ప్రజలు ఆస్తి హక్కులు కలిగి ఉండాలని జఔ నొక్కిచెప్పిందని ఆయన అన్నారు.

ఆస్తి హక్కుల సవాలుపై ఒక పుస్తకాన్ని వ్రాసిన ఒక ప్రఖ్యాత ఆర్థికవేత్త గురించి ప్రధాని ప్రస్తావించారు, గ్రామస్తుల యాజమాన్యంలో ఉన్న చిన్న మొత్తంలో ఆస్తి తరచుగా "డెడ్ క్యాపిటల్" అని పేర్కొంది. దీని అర్థం ఆస్తిని లావాదేవీల కోసం ఉపయోగించలేమని, ఇది కుటుంబ ఆదాయాన్ని పెంచడంలో సహాయ పడదని ఆయన అన్నారు.

ఆస్తి హక్కుల ప్రపంచ సవాలు నుండి భారతదేశం అతీతం కాదని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు. లక్షలాది కోట్ల ఆస్తి ఉన్నప్పటికీ, గ్రామస్తులకు తరచుగా చట్టపరమైన పత్రాలు లేవని, ఇది వివాదాలకు దారితీస్తుందని మరియు శక్తివంతమైన వ్యక్తుల అక్రమ ఆక్రమణలకు దారితీస్తుందని ఆయన పేర్కొన్నారు. చట్టపరమైన పత్రాలు లేకుండా, బ్యాంకులు కూడా అటువంటి ఆస్తుల నుండి తమ దూరం ఉంచాయని ఆయన తెలిపా రు. ఈ సమస్యను పరిష్కరించేందుకు గత ప్రభుత్వాలు పటిష్టమైన చర్యలు తీసుకోలేదని ప్రధాన మంత్రి ఎత్తిచూపారు. 2014లో స్వామిత్వ యోజన ద్వారా ఆస్తి డాక్యుమెంటేషన్ సవాలును ఎదుర్కోవాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన చెప్పారు. సున్నితత్వం కలిగిన ఏ ప్రభుత్వమూ తమ గ్రామస్తులను ఇంత బాధలో పడనివ్వదని ప్రధాని ఉద్ఘాటించారు. స్వామిత్వ యోజన గురించి వివరిస్తూ, డ్రోన్‌లను ఉపయోగించి గ్రామాల్లోని ఇళ్లు మరియు భూములను మ్యాపింగ్ చేయడం మరియు గ్రామస్థులకు నివాస ఆస్తులకు చట్టపరమైన పత్రాలను అందించడం ఇందులో ఇమిడి ఉందని చెప్పారు. ఈ పథకం ప్రయోజనాలు ఇప్పుడు కనిపిస్తున్నాయని ఆయన అన్నారు. స్వామిత్వ యోజన లబ్ధిదారులతో తన మునుపటి సంభాషణను ప్రస్తావిస్తూ, పథకం వారి జీవితాలను ఎలా మార్చేసిందో వ్యక్తపరిచిన శ్రీ మోదీ, వారు ఇప్పుడు వారి ఆస్తుల కోసం బ్యాంకుల నుండి సహాయం పొందుతున్నారని, వారి సంతృప్తి మరియు ఆనందం స్పష్టంగా కనిపిస్తున్నాయని వ్యాఖ్యానించారు. ఇది గొప్ప వరం అని ప్రధాని భావించారు.

# చట్టబద్ధమైన భూ యాజమాన్యంతో గ్రామీణ భారతదేశానికి సాధికారత కల్పించడం

న్యూఢిల్లీ, జనవరి 18:ఏప్రిల్ 24, 2020న జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి ప్రారంభించిన ౖాఎంఓఎంఎం పథకం గ్రామ అబాది ప్రాంతాల్లోని ఆస్తి యజమానులకు "హక్కుల రికార్డు" అందించడం ద్వారా గ్రామీణ భారతదేశాన్ని ఆర్థికంగా మార్చడం లక్ష్యంగా పెట్టుకుంది. భూమి సరిహద్దుల కోసం అధునాతన డ్రోన్ మరియు ఉమో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం ద్వారా, ఈ పథకం ప్రాపర్టీ మానిటైజేషన్‌ను ప్రోత్సహిస్తుంది, బ్యాంకు రుణాలకు ప్రాప్యతను సులభతరం చేస్తుంది, ఆస్తి వివాదాలను తగ్గిస్తుంది మరియు సమగ్ర గ్రామ-స్థాయి ప్రణాళికను ప్రోత్సహిస్తుంది. నిజమైన గ్రామ స్వరాజ్యాన్ని సాధించడానికి ఒక అడుగుగా, గ్రామీణ భారతదేశాన్ని శక్తివంతం చేయడంలో మరియు ఆత్మనిర్భర్‌గా మార్చడంలో చౌరవ కీలకమైనది!

18 జనవరి 2025న, ఆత్మనిర్భర్ భారత్ దృక్పథానికి ప్రతిబింబంగా, ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ 10 రాష్ట్రాలు మరియు 2 కేంద్ర పాలిత ప్రాంతాలలో 50,000 కంటే ఎక్కువ గ్రామాలలో 65 లక్షల ౖాఎంఓఎంఎం ప్రాపర్టీ కార్డులను కేంద్ర మంత్రి శ్రీ రాజీవ్ రంజన్ సింగ్ అలియాన్ సమక్షంలో ఇ-పంపిణీ చేశారు. లాలన్ సింగ్. వేడుక సందర్భంగా, అతను దేశాన్ని ఉద్దేశించి ప్రసంగించారు మరియు లబ్ధిదారులతో సంభాషించారు, దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖులు వాస్తవంగా చేరారు. ళి2రి ఈ సంఘటన SVAMITVA పథకంలో ఒక మైలురాయి విజయాన్ని సూచిస్తుంది, ఇది గ్రామీణ భారతదేశాన్ని చట్టబద్ధమైన భూ యాజమాన్యంతో సాధికారత కలిగించే దృక్పథాన్ని మరింతగా పెంచుతుంది.

# ఔను వాళ్లిద్దరు ఇష్ట పడ్డారు -పండు వయసులో ప్రేమ వివాహం ..

అమరావతి, జనవరి 18: జీవితంలో ఒంటరితనాన్ని ఏదో ఒక సమయంలో ప్రతి ఒక్కరు అనుభవించే ఉంటారు. చేతినిండా సంపాదన ఉన్నా ఏదో తెలియని వెలితి కనిపిస్తోంది. సంతోషం కలిగించే తోడు లేనప్పుడు ఎన్ని ఉన్నా ఏదో లోటు మనసును కుదురుగా ఉండనివ్వదు. ఇక వృద్ధుల్లో ఆ బాధ వర్ణనాతీతం. చిన్నపిల్లల్లా చెప్పుకోలేరు. అలా అని బాధను దిగమింగలేరు. ఈ పరిస్థితి నుంచి బయటపడేందుకు కొందరు ధైర్యం చేస్తున్నారు.మలివయస్సులో తమ హృదయంతో పెనవేసుకునే బంధం కోసం వెతుకుతున్నారు. అడ్డంకులను దాటుకుని జంటగా ప్రయాణం చేసేందుకు సిద్ధమవుతున్నారు.



# “ఖాకీ కిడ్స్” కార్యక్రమాన్ని ప్రారంభించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్..




రాజన్న సిరిసిల్ల, జనవరి 18:(నేటినిజం ప్రతినిధి): సైబర్ నేరాల నియంత్రణయే లక్ష్యంగా విద్యార్థి దశ నుండి విద్యార్థులకు సైబర్ నేరలపై,ట్రాఫిక్ సిగ్నల్స్ పై అవగాహన కల్పించి సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దాడమే లక్ష్యంగా “ఖాకీ కిడ్స్” కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన జిల్లా ఎస్పీ.జిల్లా పోలీస్ కార్యాలయంలో ఖాకీ కిడ్స్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరై జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, లైబ్రరీ చైర్మన్ సత్యనారాయణ,విద్యార్థులు,పోలీస్ అధికారులతో కలసి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ గారు ప్రారంభించారు.ఈ సందర్భంగా విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఎక్కడైతే శాంతి భద్రతలు అదుపులో ఉంటాయో అక్కడే అభివృద్ధి సాధ్యం మని, పోలీసు శాఖ ప్రభుత్వంలో కీలక పాత్ర పోషిస్తుందని,జిల్లా పోలీస్ శాఖ ప్రజలకు చేరువగా యువతకు క్రీడా పోటీలు,ఆరోగ్య శిబిరాలు,డ్రైవింగ్ లెసైన్స్, సీసీ కెమెరాల ఎర్పాటు మొదలగు సామాజిక కార్యక్రమాలు చేపడుతూ, శాంతి భద్రతల పరిరక్షణతో పాటుగా ప్రజల శ్రేయస్సే లక్ష్యంగా జిల్లా పోలీసులు పని తీరు అభినందనీయం అన్నారు.ప్రస్తుతం సమాజంలో సైబర్ నేరగాళ్లు కొంత కొంత మోసలతో ప్రజలను మోసాగిస్తున్నారని, అట్టి మోసాల బారిన ప్రజలు పడకూడదనే ఉద్దేశ్యంతో ప్రతి పోలీస్ స్టేషన్లలో సైబర్ వారియర్ లను ఎంపిక చేసి వారికి సైబర్ నేరాలు జరుగు విధానం,ట్రాఫిక్ నియమలపై శిక్షణ ఇచ్చి జిల్లాలో ఉన్న అన్ని కళాశాల్లో, పాఠశాలల్లో విద్యార్థులకు ఇంటర్నెట్ దుర్వినియోగం, ఆన్లైన్ మోసాలు ,సైబర్ మోసాల భారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరుగుతున్నారు. విద్యార్థులు ఖాకి కిడ్స్ కార్యక్రమన్ని సద్వినియోగం చేసుకొని తల్లిదండ్రులకి,కుటుంబ సభ్యులకు, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులు మంచిని స్వీకరించి చెడుకు దూరంగా ఉండాలని, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి ని స్ఫూర్తిగా తీసుకుని భవిష్యత్ లో ఉన్నత స్థానాల్లో స్థిరపడి తల్లితండ్రులకు,పుట్టిన గ్రామానికి గొప్ప పేరు తీసుకురావాలని,సంకల్పం, మనోబలం ఉంటే మనం అనుకున్న లక్ష్యాలను చేరుకోవచ్చాని అన్నారు.విద్యార్థుల జీవితంలో పదవ తరగతి పరీక్షలు మొదటి అడుగని,మార్చ్ లో నిర్వహించే పదవ తరగతి పరీక్షలో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు.

రాజన్న ఆలయంలో ఇటీవల జరిగిన పాప అపహరణ కేసును చాకచక్యంగా ఛేదించి రాష్ట్ర స్థాయిలో జిల్లా పోలీస్ వారు మంచి పెరు తెచ్చుకున్నారని గుర్తు చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ....

తల్లిదండ్రులు, ప్రజలు పిల్లలు చెప్పితే తప్పక పాటిస్తారనే ఉద్దేశ్యంతో ఖాకీ కిడ్స్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టి జిల్లాలో ప్రతి పోలీస్ స్టేషన్లో ఉన్న సైబర్ వారియర్లకు సైబర్ నేరాలకు జరుగు విధానం,ఎలా అరికట్టాలి, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించి రానున్న మూడు నెలల్లో జిల్లాలో ఉన్న అన్ని కళాశాలల్లో,పాఠాశాలలోని విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని అనంతరం గ్రామాలలోని ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుదన్నారు.

విద్యార్థులు సోషల్ మీడియాకి దూరంగా ఉండాలని, ప్రతి ఒక్కరు సోషల్ మీడియాలలో వ్యక్తిగత గోప్యత పాటించాలని,ప్రస్తుతం ఎక్కువగా వస్తున్న డిజిటల్ అరెస్ట్, ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్, ఓటిపి ఫ్రాడ్, సోషల్ మీడియాలో వచ్చే ఉద్యోగ ప్రకటనలు,అపరిచిత వ్యక్తుల నుండి వచ్చే విడియో కాల్స్ కుఫ్రాడ్, ఓల్స్ ఫ్రాడ్ లాంటి వాటికి దూరంగా ఉండాలన్నారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్పర్సన్ స్వరూప,డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి,సి.ఐ లు కృష్ణ, శ్రీనివాస్, వీరప్రసాద్, శ్రీనివాస్, ఆర్.ఐ లు మధుకర్, రమేష్ ,ఎస్.ఐ లు ,విద్యార్థులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ

## –ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

## –ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణ భూమి పూజ



రాజన్న సిరిసిల్ల, జనవరి 18:(నేటినిజం ప్రతినిధి): అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు పంపిణీ చేస్తామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణ కార్యక్రమాన్ని వేములవాడ పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో హౌసింగ్ శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ హాజరై భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలు, రేషన్ కార్డుల జారీ ప్రక్రియ ఈ నెల 26 వ తేదీ నుండి ప్రారంభంకానున్నదని వెల్లడించారు. గత పది సంవత్సరాలుగా ప్రజలు కళ్ళు కాయలు కాచేలా ఎదురుచూస్తున్న రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు..రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇండ్లు లబ్ధిదారులకు ఇవ్వడం జరుగుతుందని వివరించారు. గతంలో ప్రజాపాలన సమయంలో పెట్టుకున్న దరఖాస్తులను ఈ నెల 21 నుండి 24 వ తేదీ వరకు పరిశీలించి లబ్దిదారులను ఎంపిక జరుగుతుందని విప్ స్పష్టం చేశారు.జనవరి 26 నుండి రాష్ట్రవ్యాప్తంగా రైతులకు రైతు భరోసా కింద రూ. 12 వేలు ఎలాంటి షరతులు లేకుండా రైతులకు ఇస్తామని ప్రకటించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా భూమిలేని నిరుపేద కూలీలకు రూ. 12 వేలు ఇస్తామని వెల్లడించారు. నియోజకవర్గంలో 3500 ఇండ్లు వస్తూ ప్రత్యేక కోట కింద ముంపు గ్రామాల ప్రజలకు 4696 ఇండ్లు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందని గుర్తు చేశారు. పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక చేయడం జరుగుతుందని విప్ స్పష్టం చేశారు.ప్రజా పాలన సమయంలో దరఖాస్తు చేయలేని వారు ప్రత్యేకంగా ఆయా ఆఫీసుల్లో దరఖాస్తు చేసి పోర్టల్లో నమోదు చేయడం జరుగుతుందని వివరించారు. ఇందిరమ్మ ఇండ్ల కాన్సెప్టే పేద ప్రజలకు ఇండ్లు మంజూరు చేయడమేనని పేర్కొన్నారు.అధికారులు ఎవ్వరూ కూడా నిర్లక్ష్యం చేయకూడదనీ, సర్వే, గ్రామ, వార్డు సభల్లో అధికారులు ఓపిగ్గా ఉంటూ ప్రజలందరికీ సహాయ సహకారాలు అందించాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో కుల గణనను చేపట్టడం జరిగిందని విప్ చెప్పారు. మేలైన కార్యక్రమాన్ని తీసుకొని ముందుకు పోతామని ప్రకటించారు.తాను కూడా 21 నుంచి నిర్వహించే సభల్లో పాల్గొంటాననీ తెలిపారు. మోడల్ హౌసును వీలైనంత త్వరగా నిర్మాణం చేపట్టి మన ప్రాంత ప్రజలకు నమూనాగా చూపెట్టాలనీ తెలిపారు.కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ రోండి రాజు, గృహ నిర్మాణ శాఖ జిల్లా అధికారి చెనయ్య, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, ఎమ్మార్వో మహేశ్, ఎంపీడీవో ఎన్ మల్హోత్రా, హౌసింగ్ డిఈలు భాస్కర్, ముజఫర్, ఎంపీడీవోలు శ్రీనివాస్,ఎన్ మల్హోత్ర, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, కాంగ్రెస్ పార్టీ టౌన్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ గౌడ్ మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


**BEFORE THE MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL-CUM XII ADDL. CHIEF JUDGE: CITY CIVIL COURTS: AT: SECUNDERABAD.**

M.V.O.P.NO.582 OF 2023

**Between:**
G.Narshima Chary and another ...PETITIONERS
AND
V. Bhavani Shener Rao and others ...RESPONDENTS

**NOTICE**

**To,**
V.Bhavani Shanker RaoAged: 70 Years, Occ: Owner –Cum Driver Of the crime vehicle.
Plot No.28 Brooke Bond Colony, Near AOC Centre. Kakaguda, Secunderabad-500015
Telangana State.

Please take notice that the above named petitioners have filed a case for compensation under M.V. Act, and the same was posted on **24.01.2025,** at 10.30. A.M. for your appearance and counter if any. If you fail to appear on that the day either in person or through an Advocate, otherwise the matter will be decided on merits.

( BY ORDER OF THE COURT )

**M/S. T.RAJU, Rahul**
K. Adinarayana, ADVOCATES,
Plot No.15,Lakshmi Nagar Colony, Picket, Secunderabad.


# మత్తు పదార్థాల నిర్మూలనకు సమిష్టిగా కృషి చేద్దాం

## – ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



రాజన్న సిరిసిల్ల, జనవరి 18:(నేటినిజం ప్రతినిధి): డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వేములవాడ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపు మేరకు డ్రగ్స్, మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రజలను జాగృతం చేసేందుకు తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ రాష్ట్రవ్యాప్త ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని అన్నారు.

రాజన్న సిరిసిల్ల జిల్లాలో నిర్వహించబోయే డ్రగ్స్ వ్యతిరేక ప్రచార కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ ను శనివారం రోజున వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని గెస్ట్ హౌస్ లో ఆది శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ టీఎస్ జేయు రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు కొల్లూరు శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శి గున్నాల నరేష్ ఉపాధ్యక్షులు దూస రాజేందర్ కోడం కనకయ్య కొలగాని చందు ఏనుగుల శ్రీనివాస్ చిలుకదాసు కోడం సంతోష్ మరియు సంఘ సభ్యులు పాల్గొన్నారు

# గల్లీ నుంచి ఢిల్లీ వరకు బలంగా బీసీ నినాదం

## –రానున్న కాలం బీసీల రాజ్యం: ఆర్.కృష్ణయ్య

హైదరాబాద్, జనవరి 18: తెలంగాణలో నిర్వహించే సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లను 20 నుంచి 42 శాతానికి పెంచకుండా ఎన్నికలు నిర్వహిస్తే రాష్ట్రం అగ్ని గుండం అవుతుందని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. బీసీ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం ఆధ్వర్యంలో శుక్రవారం కాచిగూడలోని అభినందన్ హోటల్లో జాతీయ బీసీ మేధావుల సదస్సును నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఆర్.కృష్ణయ్య, శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూద నాచారి, బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు, ఏఐసీసీ ఓబీసీ ప్రధాన కార్యదర్శి కత్తి వెంకటస్వామి హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ రానున్న స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం పెంచాలని, ప్రత్యేక అసెంబ్లీ సమావేశాన్ని ఏర్పాటు చేసి, చట్టం చేసి ఎన్నికలకు వెళ్లాని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బీసీ వాదం బలంగా ఉందని, రానున్న కాలం బీసీల రాజ్యమేనని వెల్లడించారు. బీసీలకు కామారెడ్డి బీసీ డిక్లరేషన్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేయాలని, గల్లీ నుంచి ఢిల్లీ వరకు బీసీ నినాదం అత్యంత బలంగా ఉందని, అందుకు రాజ్యాంగాన్ని సవరించాలని డిమాండ్ చేశారు. అనంతరం మధుసూదనాచారి మాట్లాడుతూ, దేశంలో అధిక శాతం బీసీలు ఉన్నారని, ఐనప్పటికీ బానిసలుగా బతుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

బీసీలు రాజ్యాధికార దిశగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. బీసీలు ఓటర్లుగా కాకుండా నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని పేర్కొన్నారు. కేసీఆర్ తెలంగాణ ఉద్యమం లాగా బీసీ ఉద్యమం వచ్చినప్పుడే బీసీల బతుకులు మారుతాయని వెల్లడించారు. కార్యక్రమంలో గొరిగ మల్లేశ్, నీలం వెంకటేశ్, రాజేందర్, వేముల రామకృష్ణ, నందగోపాల్, అనంతయ్య, పి.శ్రీనివాస్ నాయి, రామ్దేవ్ మోదీ, జయంతి గౌడ్, రమాదేవి, భాగ్యలక్ష్మితో పాటు మేధావులు, అఖిల పక్ష ప్రజా ప్రతినిధులు, ఉద్యోగ, ఉపాధ్యాయ, న్యాయవాదులు, డాక్టర్లు, వివిధ పార్టీల ప్రజా ప్రతినిధులు, కుల సంఘాలు, మహిళా, యువజన, విద్యార్థి నేతలు పాల్గొన్నారు.

# రంజీల్లో ఆడతారా..?



హైదరాబాద్, జనవరి 18: బీసీసీఐ ఆదేశాల మేరకు రంజీ ల్లో ఆడనున్నట్లు టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ స్పష్టం చేశాడు. ముంబయి–జమ్మూ కశ్మీర్ జట్ల మధ్య జరిగే రంజీ మ్యాచ్కు అందుబాటులో ఉంటానని చెప్పాడు. అయితే, అంతర్జాతీయ క్యాలెండర్లోని బిజీ షెడ్యూల్ కారణంగా స్టార్ ఆటగాళు దేశవాళీ క్రికెట్ ఆడేందుకు సమయం దొరకడం కష్టమని తెలిపాడు. దేశీయ రెడ్బాల్ టోర్నీలను ఏ క్రికెటర్ తేలిగ్గా తీసుకోరని రోహిత్ పేర్కొన్నాడు. చాంపియన్స్ ట్రోఫీ తో పాటు ఇంగ్లాండ్తో వన్డే సిరీస్కు శనివారం బీసీసీఐ జట్టును ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్తో కలిసి రోహిత్ మీడియా ముందుకు వచ్చాడు.

ఈ సందర్భంగా రంజీ ట్రోఫీలో ఆడతారా.. అన్న ప్రశ్నకు రోహిత్ సానుకూలంగా స్పందించాడు. గత ఆరేడు సంవత్సరాలుగా క్యాలెండర్ను పరిశీలిస్తే తాము 45 రోజులుగా ఇంట్లో కూర్చోలేదని చెప్పాడు. ఐపీఎల్ ముగిసిన వెంటనే అంతర్జాతీయ మ్యాచులు లేనప్పుడు మాత్రమే విశ్రాంతి దొరికేదని తెలిపాడు. డొమెస్టిక్ సీజన్ అక్టోబర్లో ప్రారంభమై.. మార్చి వరకు కొనసాగుతుందని.. జాతీయ జట్టు తరపున అన్ని ఫార్మాట్లలో ఆడని ఆటగాళ్లు దేశీయ క్రికెట్ ఆడొచ్చని చెప్పాడు. తన గురించి చెప్పాల్సి వస్తే.. తాను 2019 నుంచి క్రమం తప్పకుండా టెస్ట్ క్రికెట్ను ఆడుతూ వచ్చానని టీమిండియా కెప్టెన్ తెలిపాడు.ఈ పరిస్థితుల్లో చాలా తక్కువ సమయం ఉంటుందని.. అంతర్జాతీయ క్రికెట్ను క్రమం తప్పకుండా ఆడుతున్న సమయంలో తమని తాము రిఫ్రెష్ చేసుకోవడం కొంత సమయం అవసరమని అభిప్రాయపడ్డాడు. దేశీయ క్రికెట్ని ఎవరూ తక్కువగా తీసుకోవడం లేదని స్పష్టం చేశాడు. ఇదిలా ఉండగా.. 37 ఏళ్ల రోహిత్ శర్మ ఇటీవల టెస్టుల్లో పేలవమైన ఫామ్తో ఇబ్బందులుపడుతున్నాడు. చివరి 15 టెస్ట్ ఇన్నింగ్స్లో ఒకే ఒక అర్ధ సెంచరీ చేసిన రోహిత్.. ఈ ఫార్మాట్కు రిటైర్మెంట్ ప్రకటించేందుకు నిరాకరించాడు. మంగళవారం వాంఖడే స్టేడియంలో ముంబయి జట్టుతో కలిసి ప్రాక్టీస్ చేశాడు. ఇటీవల ఆస్ట్రేలియా పర్యటనలో రోహిత్ ఘోరంగా విఫలమయ్యాడు. ఐదు ఇన్నింగ్స్లో కేవలం 31 పరుగులు మాత్రమే చేశాడు. విమర్శల నేపథ్యంలో చివరిదైన సిడ్నీ టెస్టుకు దూరంగా ఉన్న విషయం తెలిసిందే.

# ఇంగ్లాండ్తో వన్డే సిరీస్కు భారత జట్టు ఇదే..

# ఫాస్ట్ బౌలర్ బుమ్రా దూరం.. షమీకి ఛాన్స్..!




హైదరాబాద్, జనవరి 18:వచ్చే నెల ఇంగ్లాండ్ తో జరిగే మూడు వన్డేల సిరీస్ కు భారత జట్టును శనివారం బీసీసీఐ ప్రకటించింది. చాంపియన్స్ ట్రోఫీ కి ముందు జరిగే వన్డే సిరీస్లో సెలక్షన్ కమిటీ కేఎల్ రాహుల్ కు జట్టులో చోటు కల్పించింది. ఇటీవల ఇంగ్లాండ్తో జరిగే టీ20 సిరీస్కు జట్టును ప్రకటించిన విషయం తెలిసిందే. చాలా రోజుల తర్వాత టీ20ల్లోకి ఎంట్రీ ఇవ్వనున్న ఫాస్ట్ బౌలర్ మహ్మద్ షమీ కి వన్డే జట్టులోనూ అవకాశం ఇచ్చింది. జనవరి 22 నుంచి భారత్–ఇంగ్లాండ్ మధ్య ఐదు మ్యాచుల టీ20 సిరీస్ జరుగనున్నది. సూర్యకుమార్ యాదవ్ టీమిండియాను నడిపించనున్నాడు.

**బుమ్రా ఆడేది కష్టమే..?**

ఇక వన్డే సిరీస్కు రోహిత్ శర్మ నాయకత్వం వహిస్తాడు. వన్డే సిరీస్లో తొలి రెండు మ్యాచులకు ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రాకు బీసీసీఐ విశ్రాంతి ఇచ్చింది. అయితే, ఇప్పటి వరకు మూడు వన్డేలో ఆడడం విషయంలోనూ స్పష్టత లేదు. జట్టును ప్రకటించే సమయంలో సెలక్షన్ కమిటీ చైర్మన్ అజిత్ అగార్కర్ సైతం చాంపియన్స్ ట్రోఫీ వరకు జస్ప్రీత్ బుమ్రా ఫిట్గా ఉంటాడని ఆశిస్తున్నామన్నారు. బుమ్రా ఫిట్గా లేకపోతే.. అతని స్థానంలో హర్షిత్ రాణా అందుబాటులో ఉంటాడు. ఇక హైదరాబాదీ ఫాస్ట్ బౌలర్ మహ్మద్ సిరాజ్కు 15 మంది సభ్యుల జట్టులో చోటు దక్కలేదు. ఇంగ్లాండ్తో టీ20 సిరీస్కు సైతం ఎంపిక చేయని విషయం తెలిసిందే. ఇక ఓపెనర్ యశస్వి జైస్వాల్కు తొలిసారిగా వన్డే జట్టులో అవకాశం లభించింది.

**వైస్ కెప్టెన్గా శుభ్మాన్ గిల్..**

ఇంగ్లాండ్తో వన్డే సిరీస్లో రోహిత్ కెప్టెన్గా, శుభ్మాన్ గిల్కు వైస్ కెప్టెన్గా వ్యవహరించనున్నాడు. ఇంగ్లాండ్తో వన్డేల్లో హిట్మ్యాన్తో కలిసి వన్డేల్లో విరాట్ సైతం ఆడనున్నాడు. ఇద్దరు దాదాపు ఆరు నెలల విరామం తర్వాత ఇద్దరూ ఈ ఫార్మాట్లో ఆడనుండడం గమనార్హం. గతంలో భారత జట్టు శ్రీలంకతో మూడు మ్యాచ్ల వన్డే సిరీస్ ఆడింది. ఈ సిరీస్లో ఆతిథ్య జట్టు టీమ్ ఇండియాను 2–0తో ఓడించిన విషయం తెలిసిందే. శ్రీలంకతో సిరీస్కు రోహిత్, కోహ్లీకి విశ్రాంతి ఇచ్చారు.

**నలుగురు స్పిన్నర్లకు చోటు**

ఇంగ్లాండ్తో జరిగే వన్డే సిరీస్లో నలుగురు స్పిన్నర్లకు సెలక్షన్ కమిటీ ఎంపిక చేసింది. అక్షర్ పటేల్, రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, వాషింగ్టన్ సుందర్లను ఎంపిక చేసింది. టీ20 సిరీస్ కోసం టీమ్ ఇండియా వైస్ కెప్టెన్గా అక్షర్ను నియమించిన విషయం తెలిసిందే. కుల్దీప్ యాదవ్ దాదాపు నాలుగు నెలల తర్వాత మళ్లీ టీమిండియాతో చేరాడు. గత ఏడాది అక్టోబర్లో న్యూజిలాండ్తో జరిగిన టెస్ట్ సిరీస్లో గాయపడ్డ విషయం తెలిసిందే. ఇంగ్లాండ్తో వన్డే సిరీస్లో పునరాగమనం చేసేందుకు రెడీ అయ్యాడు.

**ఇంగ్లాండ్తో వన్డే సిరీస్ ఇలా..**

ఇంగ్లాండ్తో స్వదేశంలో భారత జట్టు మూడు వన్డేలు ఆడుతుంది. అంతకు ముందు ఐదు మ్యాచుల టీ20 సిరీస్లో తలపడుతుంది. తొలి వన్డే ఫిబ్రవరి 6న నాగ్పూర్ వేదికగా జరుగుతుంది. ఇక రెండో వన్డే ఫిబ్రవరి 9న ఆదివారం కటక్లో ఉంటుంది. ఇంక మూడో వన్డే ఫిబ్రవరి 12న బుధవారం అహ్మదాబాద్ వేదిక జరుగుతుంది.

**వన్డే సిరీస్కు భారత జట్టు..**

రోహిత్ శర్మ (కెప్టెన్), శుభ్మాన్ గిల్ (వైస్ కెప్టెన్), విరాట్ కోహ్లీ, శ్రేయాస్ అయ్యర్, కేఎల్ రాహుల్, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, హర్షిత్ రాణా, మహ్మద్ షమి, అర్ష్దీప్ సింగ్, యశస్వి జైస్వాల్, రిషబ్ పంత్, రవీంద్ర జడేజా.

# క్రీడాకారులు ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని కలిగి ఉండాలి

## –ఇండోర్ స్టేడియం ఏర్పాటుకు చర్యలు

## –జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్...



రాజన్న సిరిసిల్ల, జనవరి 18:(నేటినిజం ప్రతినిధి): క్రీడాకారులు ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని కలిగి ఉండాలని జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు.. శనివారం వేములవాడ పట్టణ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను ప్రభుత్వ విప్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తే జీవితంలో ఎంత పెద్ద ఇబ్బందులు ఎదురైన ఎదుర్కొనికి దృఢంగా ఉంటారని పేర్కొన్నారు.. క్రీడల వల్ల మానసిక ఉల్లాశం శరీరక దృఢత్వం లభిస్తుందన్నారు. మన ప్రాంతం కబడ్డీ,వాలీబాల్ క్రీడలకు పెట్టింది పెరన్నారు..యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా క్రిడలపట్ల మక్కువ పెంచుకోవాలని అన్నారు.. క్రీడాకారులు మ్యాట్లు కావాలని కోరగానే షాప్ చైర్మన్ శివసేన రెడ్డితో మాట్లాడగా తప్పకుండా ఇస్తానని హామీ ఇచ్చారని తెలిపారు..తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్రీడలకు ప్రాధాన్యత ఇస్తున్నారని రానున్న ఒలంపిక్ పోటీల్లో పాల్గొనడానికి రాష్ట్రంలో స్పోర్ట్స్ యూనివర్సిటీ ప్రారంభించడం జరుగుతుందన్నారు..కబడ్డి,వాలీబాల్ స్టేట్ మీట్ కు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు. గంజాయి రహిత రాష్ట్రంగా తెలంగాణ రాష్ట్రాన్ని మార్చడానికి ప్రభుత్వం ముందుకు పోతుందన్నారు.. ప్రతిభా ఉన్న క్రీడాకారులకు ప్రభుత్వం తరుపున ప్రోత్సాహకం అందించే దిశగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.. గతంలో నూకలమర్రి గ్రామంలో స్టేట్ మీట్ నిర్వహించినప్పుడు శ్రీధర్ బాబు వచ్చారని గుర్తు చేశారు..మన ప్రాంతంలో ఇండోర్ స్టేడియం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు..ప్రజా ప్రభుత్వం లో స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ ప్రారంభం చేస్తే ఇతరులు వాట్సాప్ యూనివర్సిటీలో ప్రారంభనీ చేసి ప్రజల్లో విద్వేషాలు రెచ్చగొడుతున్నారు.. క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేయాలని నిర్వాహకులకు సూచించారు..ఈ కార్యక్రమంలో వేములవాడ ఏఎస్పి శేషాద్రి రెడ్డి, జిల్లా కబడి అసోసియేషన్ అధ్యక్షులు ముస్కు మల్లారెడ్డి,వర్కింగ్ ప్రెసిడెంట్ బొడ్డు రాములు, సెక్రటరీ తిరుపతి,పట్టణ సీఐ వీరా ప్రసాద్ , మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, మున్సిపల్ వైస్ చైర్మన్ మహేష్, పట్టణ అధ్యక్షులు సంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, సంఘం స్వామి యాదవ్,వకలాభరణం శ్రీనివాస్, కౌన్సిలర్లు , యువకులు క్రీడాకారులు పాల్గొన్నారు..

# అన్ని దానాల కన్నా అన్నదానం మిన్న

రాజన్న సిరిసిల్ల, జనవరి 18:(నేటినిజం ప్రతినిధి): అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పదని బిజెపి పట్టణ అధ్యక్షులు, సత్రం కోశాధికారి డా. రాపల్లి శ్రీధర్ అన్నారు. శనివారం వేములవాడ లోని శివదిక్ష సత్రం నకు ఒక క్వింటల్ బియ్యం వాసలమర్రి గోపి లడ్డు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ వారి కుటుంబానికి రాజన్న ఆశీస్సులు ఏళ్ల వేళల ఉండాలని కోరుకుంటున్నామని అన్నారు. శివ దీక్ష నిత్య దాన ట్రస్టుకు దాతలు అందరు సహకరించాలని కోరారు. ఈ



కార్యక్రమం లో సత్రం గౌరవ అధ్యక్షులు మచ్చ కిషన్, ప్రధాన కార్యదర్శి రమణయ్య,, ఇంచార్జి కనుకయ్య,, గురుస్వామి తమ్మల బీమన్న పాల్గొన్నారు

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.